నమస్తే తెలంగాణ
# జిందగీ
11
హైదరాబాద్ | బుధవారం 11 సెప్టెంబర్ 2024 www.ntnews.com

## 'పొగ' పెట్టుకోవద్దు



**ఆధునికత పేరుతో ఆడవాళ్లు కూడా ధూమపానం చేస్తున్నారు. ఈ అలవాటు ఎవరికైనా అనారోగ్యకరమే! అయితే, ఇది గర్భిణులపై తీవ్ర ప్రభావం చూపుతుందని చైనాకు చెందిన ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తున్నది. తాజాగా నిర్వహించిన ఓ సర్వేలో ధూమపానం వల్ల గర్భిణులకు కలిగే అనర్థాలను వెల్లడించింది.**

సిగరెట్ పొగలో దాదాపు నాలుగు వేల రకాల రసాయనాలు ఉంటాయి. అవి గర్భిణుల రక్తంలో కలిసిపోయి.. ప్లాసెంటా ద్వారా కడుపులోని పిండాన్ని చేరుతాయి. అలా.. శిశువు ఎదుగుదలకు, మానసిక అభివృద్ధికీ తీవ్రమైన ఆటంకాలను కలిగిస్తాయి. అంతేకాదు.. ఇందులోని కొన్ని రసాయనాలు తల్లి హృదయ స్పందనల రేటుపై ప్రభావం చూపుతాయి. దాని వల్ల కాన్పు సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయి. ముందునుంచే ఈ అలవాటు ఉండి, గర్భధారణ తర్వాత మానేసినా.. 27 శాతం మందికి ఈ సమస్య వచ్చే అవకాశం ఉంటుందట. అదే ప్రెగ్నెన్సీ సమయంలోనూ ధూమపానం చేస్తే.. ముప్పు అవకాశం 31 శాతం నుంచి 32 శాతం వరకు ఉంటుందని సర్వే చెబుతున్నది. పని ఒత్తిడిలోనో.. ఇంకేదో టెన్షన్‌లోనో రోజులో ఒక్క సిగరెట్ తాగినా.. పుట్టబోయే పిల్లలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని సర్వేకారులు చెబుతున్నారు. అందుకే తల్లితోపాటు పుట్టబోయే బిడ్డకూడా ఆరోగ్యంగా ఉండాలి అనుకుంటే.. స్మోకింగ్ తక్షణం మానేయాలని సర్వే సారాంశం.



# కథలు రాస్తూ.. ఊహలు నిజం చేస్తూ..

**కొవిడ్ ప్రబలిన రోజులవి. కామారెడ్డి దగ్గర్లోని ఓ పల్లె. అక్కడ ఓ పాతికేండ్ల యువతి భర్తను కరోనా కబళించింది. ఇద్దరు పిల్లల ఆ తల్లికి ఏం చేయాలో పాలుపోలేదు. భర్త బ్యాంకు ఖాతాలో ఎంత డబ్బుందో కూడా ఆమెకు తెలియదు. ఎలా తెలుసుకోవాలో అర్థం కాలేదు. ఆమె దీనస్థితిని ఎవరో సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఆ పోస్టును చూసింది శ్రీఊహ. క్షణం ఆలస్యం చేయకుండా ఆ యువతి దగ్గరికి వెళ్లింది. తనకు చేతనైన సాయం చేసి వచ్చింది. అయినా.. ఆమె మనసు కుదుటపడలేదు. స్మార్ట్‌ఫోన్ల రూపంలో అరచేతిలోకి వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోలేని స్థితిలో ఎందరో ఉన్నారు. వారికోసం కార్పొరేట్ కొలువును కాదనుకొని.. వీహబ్‌తో సరికొత్త ప్రయాణానికి శ్రీకారం చుట్టింది ఊహ.**

'ఎవరీ ట్యాంక్‌బండ్ శివ?..' అని ఆరాతీసింది ఊహ. హుస్సేన్‌సాగర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడేవారిని కాపాడటమే లక్ష్యంగా బతుకుతున్నవాడు. కాలుష్య కాసారంలోకి దిగడమే ఆశ్చర్యమైతే, ఎందరి ప్రాణాలో కాపాడటం అద్భుతం అనుకుంది. అతణ్ని కలిసింది. తన గాథంతా తెలుసుకుంది. 'శివ అంటే ఈడే' అనే కథను రాసింది. అదికాస్తా వైరల్ కావడంతో అప్పటి ఐటీ, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కేటీఆర్ ట్యాంక్‌బండ్ శివకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ప్రకటించారు.

**ఇంతకీ** ఎవరీ ఊహ. కొందరి వ్యథలు తీర్చాలనీ, మరికొందరి గాథలు ప్రపంచానికి చాటిచెప్పాలని భావిస్తున్న శ్రీఊహ చిక్కటి రచన చేసే చక్కటి సాహితీమూర్తి. సామాజిక కోణంలో సాగే ఆమె సాహితీ ప్రస్థానంలో రెండు పుస్తకాలు వెలుగు చూశాయి. ఆమెకు ప్రతిష్ఠాత్మక అవార్డులు తెచ్చిపెట్టాయి. సోషల్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ ద్వారా ఎందరో మహిళల ఊహలకు రెక్కలు తొడుగుతున్న శ్రీఊహ కథ ఇది..

**శ్రీఊహ సజ్జ..** పుట్టింది, పెరిగింది హైదరాబాద్‌లోనే! కోల్‌కతా ఐఐఎంలో ఎంబీఏ చేసింది. తర్వాత నల్సార్ లా యూనివర్సిటీలో పీజీ డిప్లొమా చదివింది. చదువు పూర్తవడంతోనే సాఫ్ట్‌వేర్ కొలువు కొట్టింది. ఏడాదికి రూ.30 లక్షల ప్యాకేజీ. తండ్రి జర్నలిస్ట్. తల్లి బ్యాంకర్. అన్నీ ఉన్నా.. ఏదో వెలితి. కామారెడ్డి యువతి కన్నీటి గాథ ఊహను కలిచివేసింది. కార్పొరేట్ ఉద్యోగానికి టాటా చెప్పింది. సామాజిక జీవనానికి శ్రీకారం చుట్టింది. నలుగురికీ మేలు చేయాలనే లక్ష్యంతో వీహబ్‌లో ఇన్నొవేషన్ ఎకో సిస్టమ్ సోషల్ సెక్టార్‌లో డైరెక్టర్‌గా పనిచేస్తున్నది. 'మహిళా సామాజిక వ్యవస్థాపకత' (సోషల్ ఆంత్రప్రెన్యూర్‌షిప్) ద్వారా అనేకమంది గ్రామీణ మహిళలను ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నది. ఆంత్రప్రెన్యూర్‌గా ఎదిగే క్రమంలో అతివలకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరిస్తున్నది. సమాజంలో సానుకూల మార్పులను తీసుకురావడానికి వ్యాపారాత్మక నమూనాలను వివరించి.. గ్రామీణ మహిళలను వ్యాపార రంగం వైపు అడుగులు వేయిస్తున్నది. ఎలాంటి లాభాపేక్ష లేకుండా, సామాజిక సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, విద్య, ఆరోగ్యం లాంటి అంశాల్లో మార్పు కోసం తనవంతుగా కృషి చేస్తున్నది.




### వీహబ్ వేదికగా..

వీహబ్‌లో చేరాక మహిళా ఆంత్రప్రెన్యూర్లను గుర్తించడం, వారిని ప్రోత్సహించడం పనిగా పెట్టుకుంది ఊహ. వారి ప్రయాణంలో ఉన్న ప్రతిబంధకాలను అధిగమించేందుకు చేయూతను ఇస్తున్నది. 'మహిళా పారిశ్రామికవేత్తల కోసం వ్యాపార ఆలోచనల అభివృద్ధి, వ్యాపార ప్రణాళికలు రూపొందించడం, ప్రభుత్వాలు, ప్రైవేట్ రంగ సంస్థలు, పెట్టుబడిదారులు వంటి వ్యాపార భాగస్వాములతో సుస్థిర సంబంధాలు ఏర్పరచడం, కొత్త కార్యక్రమాలు రూపొందించడం, ప్రభుత్వ పథకాలు సంబంధిత ఆంత్రపెన్యూర్స్‌కు ఉపయోగపడేలా చూడటం, ఇన్నొవేషన్ ప్రోత్సాహకాలు, నిధుల సమీకరణ వంటి కార్యక్రమాలను పర్యవేక్షించడం, కొత్త పెట్టుబడులను ఆకర్షించడం, మార్కెట్ రీసెర్చ్, గవర్నమెంట్ రిలేషన్స్ తదితర టాస్కులు చేస్తుంటాను. సృజనాత్మకత, పట్టుదల ఉన్న మహిళలను ప్రోత్సహిస్తే అద్భుతాలు ఆవిష్కృతం అవుతాయి. వారి ప్రతిభకు తగ్గ వేదికను అందించడానికి అహరహం పనిచేస్తున్నాను' అని చెబుతున్నది ఊహ. ఈ ప్రయాణంలో కేవలం వీహబ్ టవర్‌కే పరిమితం కాలేదామె! కొండలు, గుట్టలు, వాగులు, వంకలు దాటి.. వేలాది మందికి వ్యాపార పాఠాలు నేర్పింది. ఎంతోమంది పట్టణ, గ్రామీణ మహిళలను వీహబ్‌కు రప్పించగలిగింది. ప్రభుత్వం నుంచి ఆర్థికంగా తోడ్పాటు అందేలా కృషి చేస్తున్నది.

### సాహితీ సాగు..

ఊహకు సాహిత్యమంటే ప్రాణం. తీరిక సమయాల్లో మనసు కదిలించే కథలు రాయడం తనకు వారసత్వంగా అబ్బిన వ్యసనం అంటుందామె. ఈ సాహితీ సాగులో వెలువడిన సంకలనాలే 'ఇసుక అద్దం', 'బల్కావ్'. 'ఇసుక అద్దం'లో స్త్రీల సహజమైన శరీరధర్మాల చుట్టూ సమాజం అల్లిన మార్మిక భావజాలం, నిర్దేశించిన సౌందర్య ప్రమాణాలు, కెరీర్ కోసం పోటీ, కుటుంబ సంబంధాల్లో దూరాలు, నైతిక ప్రమాణాల్లో హిపోక్రసీ, పిల్లల పెంపకంలో సమస్యలు తదితర అంశాలను అధారంగా చేసుకొని అందమైన కథలు రాసిందామె! ఊహ తన కథల్లో పాత్రలను బాధితులుగా చిత్రీకరించదు. బలమైన వ్యక్తిత్వం ఉన్నవారిగా చూపుతుంది. ఇక రెండో పుస్తకం 'బల్కావ్'! అంటే బాల్కనీ అని అర్థం. తన సోలో బ్యాక్‌ప్యాక్ విహారాల్లోంచి ఇందులోని కథలు పుట్టాయి. వీటిలో కొన్ని ప్రత్యక్షంగా చూసి రాసినవైతే, మరికొన్ని ఊహించి రాసినవి. ఆమె కథా వస్తువులు ఇప్పటి కాలజాలం నుంచి కొన్ని పుడితే... వందలేండ్ల కిందటి గాథలు మరికొన్ని.



### వృత్తి.. ప్రవృత్తి.. సంతృప్తి..

'ఇసుక అద్దం' పుస్తకానికి యండమూరి వీరేంద్రనాథ్ ఉగాది పురస్కారం, పురాణం శ్రీనివాస శాస్త్రి కథా పురస్కారం లభించాయి. అందులోని 'చుక్క పొడిచింది'కి వాయిస్ అఫ్ తెలంగాణ అవార్డు, హాసిని రామచంద్ర ఫౌండేషన్ కథా పురస్కారం, ఖమ్మం ఈస్థటిక్స్ పురస్కారం దక్కాయి. అలాగే ఈ పుస్తకం ద్వారా ఊహ కొన్ని సామాజిక సమస్యల గురించి ప్రస్తావించింది. దీనికిగానూ, గతేడాది విడుదలైన '50 ఇన్‌స్పైరింగ్ విమెన్ ఆఫ్ తెలంగాణ' ఫీచర్‌లో ఊహకు చోటు లభించింది. ఇసుక అద్దంలోని 'వాష్' అనే కథను ఢిల్లీలో కేంద్ర సాహిత్య అకాడమీ పెద్దల సమక్షంలో ప్రెజెంట్ చేసే అవకాశం కూడా దక్కింది. 'ఇసుక అద్దం'లో ప్రస్తావించిన పలు అంశాలు కేస్ స్టడీస్‌లా తీసుకుంటామని ఢిల్లీ యూనివర్సిటీలో ఓ ప్రొఫెసర్ పేర్కొనడం ఊహ రచనా వైచిత్రిని తెలియజేస్తుంది. 'కొందరు చేస్తున్న వృత్తిలో సంతృప్తిని వెతుక్కుంటారు. మరికొందరు తమ ప్రవృత్తికి తగ్గ పనులు చేస్తూ ఆనందాన్ని పొందుతారు. నేను ఈ రెండిటినీ ఎంజాయ్ చేస్తున్నా' అంటున్న ఊహ మరెందరికో ఆదర్శమని చెప్పకుండా ఉండలేం!

... రవికుమార్ తోటపల్లి

# ఇక 'సోలో'గానే



**సోలోగామి.. ఆ మధ్య తెగ వైరల్ అయిన మాట! ఈ మాటకర్థం.. తనను తానే పెళ్లిచేసుకోవడం! ఇష్టం ఉండాలే కానీ, ఆడవాళ్లు ఆడవాళ్లను.. మగవాళ్లు మగవాళ్లనే పెళ్లిళ్లు చేసుకుంటున్న కాలమిది. ఈ విపరీత పరిణామాలు చాలవన్నట్టు బ్రెజిల్‌కు చెందిన స్యూలెన్ కేరీ అనే 36 ఏండ్ల వనిత.. గతేడాది తనను తానే మనువాడి వార్తల్లో నిలిచింది. సామాజిక మాధ్యమాల్లోనూ తెగ వైరల్ అయ్యింది. తాజాగా తన నుంచి తాను విడాకులు తీసుకున్నట్లు ప్రకటించి.. మరో బాంబ్ పేల్చింది.**

**సోషల్ మీడియా** ఇన్‌ఫ్లుయెన్సర్, మోడల్ అయిన స్యూలెన్ కేరీ.. తనకు తగిన భాగస్వామి దొరక్కపోవడంతో స్వీయ వివాహం చేసుకున్నది. అయితే, తన వివాహబంధం పట్ల అసంతృప్తితోపాటు ఒంటరితనం భరించలేక విడాకులు తీసుకుంటున్నట్లు ప్రకటించింది. తనపై తనకు చాలా అంచనాలు ఉన్నాయనీ, వాటిని అందుకోలేకపోవడమే ఈ విడాకులకు కారణమని చెప్పుకొచ్చింది. విడాకుల నిర్ణయానికి ముందు ఆమె 'కపుల్స్ థెరపీ' కూడా తీసుకున్నదట. కౌన్సెలింగ్ సెషన్లకూ హాజరైందట. ఇవేవీ ఫలితాన్ని ఇవ్వకపోవడంతో విడాకులే పరిష్కారం అన్న నిర్ణయానికి వచ్చిందట. అయితే, స్యూలెన్ కేరీని ఆదర్శంగా తీసుకొని.. తనను తానే పెళ్లి చేసుకున్న గుజరాత్‌లోని వడోదరకు చెందిన క్షమా బిందు మాత్రం.. ఇటీవలే తన వివాహ తొలి వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం విశేషం!

# ఈ నడుము నొప్పి ఎందుకు?

**నమస్తే మేడం. నా వయసు 37 సంవత్సరాలు. తొలిసారి గర్భం ధరించాను. సహజ గర్భమే. నెల తప్పి 20 రోజులు అయింది. అయితే బాగా నడుము నొప్పి వస్తున్నది. తొలి రోజుల్లో ఇలా జరగడం సహజమేనా. ఇలా నొప్పి ఎందుకు వస్తుంది. తొమ్మిది నెలలూ ఉంటుందా?**

జిందగీ క్లినిక్



సాధారణంగా నెల తప్పగానే నడుము నొప్పి రావడం జరగదు. మీ విషయంలో ఇలా ఎందుకు అయింది అన్నదానికి కొన్ని పరీక్షలు చేస్తే తప్ప తేల్చలేం. ఇందుకోసం మంచి గైనకాలజిస్టుని సంప్రదించండి. బీపీ, షుగర్, థైరాయిడ్, పీసీఓఎస్ లాంటి వాటికి సంబంధించిన పరీక్షలు చేస్తారు. అలాగే ఆస్టియోపోరోసిస్ ఏమైనా ఉందా నిర్ధారించుకోవాలి. 37 సంవత్సరాలకు తొలి గర్భం అంటున్నారు. ఎందుకు ఆలస్యం అయింది, ఇంతకు ముందు ఏమైనా మందులు వాడారా అన్నది తెలియాలి. బరువు ఎక్కువగా ఉన్నారా, ఎత్తుకు సరిపడా ఉన్నారా అన్నదీ చూసుకోవాలి. వీటి ఫలితాల ఆధారంగా మీ నొప్పికి కారణాలు తెలియవచ్చు. ఈ సమయంలో మీరు నొప్పి మాత్రలు మాత్రం వేసుకోకూడదు. అలాగే గర్భం ఆలస్యం అయింది కాబట్టి, పిండం ఆరోగ్యం గురించి తెలుసుకునేందు జెనెటిక్ టెస్ట్ అని చేస్తారు. అది చేయించుకోండి. ఇక, మీ నొప్పి గర్భధారణ సమయం అంతా ఉంటుందా అన్నది ఇప్పుడే చెప్పడం కష్టం.



డాక్టర్ పి. బాలాంబ
సీనియర్ గైనకాలజిస్ట్

# అక్కలూ.. ఇవీ మీ హక్కులు!

యావత్ దేశాన్నీ కుదిపేసిన 'కోల్‌కతా జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటన' నేపథ్యంలో బెంగాల్ ప్రభుత్వం 'అపరాజిత' బిల్లును తీసుకొచ్చింది. మహిళలు – పిల్లలపై లైంగిక నేరాలు, వేగవంతమైన విచారణ, దోషులకు కఠిన శిక్షలు విధించడమే లక్ష్యంగా.. బెంగాల్ అసెంబ్లీలో ఈ బిల్లు ఆమోదం పొందింది. అప్పుడెప్పుడో 2012లో జరిగిన 'ఢిల్లీ హత్యాచార ఘటన' సందర్భంగా 'నిర్భయ' చట్టం అమల్లోకి వచ్చింది. ఇప్పుడు బెంగాల్ ప్రభుత్వం 'అపరాజిత' బిల్లును ఆమోదించింది.

ఈ క్రమంలో ఎన్నో ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. అసలు.. మహిళలు – చిన్నారులపై వేధింపులు, వారి రక్షణ కోసం జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ఎలాంటి చట్టాలు అమలులో ఉన్నాయి? వాటిలో ముఖ్యమైనవి ఏవి? మహిళలను రక్షించడానికి జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో అనేక చట్టాలు రూపొందాయి. అయితే, ఆయా చట్టాలపై సరైన అవగాహన లేకపోవడంతో బాధితులు వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో భారతదేశంలోని ప్రతి మహిళా తెలుసుకోవాల్సిన ఏడు ముఖ్యమైన చట్టపరమైన హక్కుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!



**1 గృహహింసకు వ్యతిరేకంగా..**
గృహహింస నిరోధక చట్టం – 2005.. మహిళలను ఇంట్లో ఎదురయ్యే హింస నుంచి రక్షిస్తుంది. గృహిణిపై చేయి చేసుకోవడమే కాదు.. ఆమెను మాటల ద్వారా, ఆర్థికంగా, భావోద్వేగాలపరంగా, లైంగికంగా వేధించినా.. 498 సెక్షన్ ప్రకారం దోషులను కఠినంగా శిక్షించవచ్చు.

**2 పనికి తగ్గ జీతం**
సమాన పనికి సమాన వేతనం పొందడం మహిళల హక్కు. మహిళా కూలీలు మొదలుకొని.. ఉన్నతోద్యోగాలు చేసే మహిళల కోసం 'సమాన వేతన చట్టం' అమలులో ఉన్నది. పనిచేసే మహిళలు.. వారి సహోద్యోగులతో సమానమైన వేతనాన్ని ఈ చట్టం ద్వారా డిమాండ్ చేయొచ్చు. కూలీలు, ఉద్యోగినులకు వేతనాలు, ఇతర అలవెన్సుల విషయంలో లింగ వివక్ష చూపడం నేరం కూడా!

**3 పని ప్రదేశాల్లో రక్షణ**
పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేకమైన చట్టం ఉన్నది. ఈ చట్టం ప్రకారం.. పనిలో లైంగిక వేధింపులకు గురైతే.. ఉన్నతాధికారులకు నివేదించే హక్కు మహిళలకు ఉంది. ఈ చట్టం ప్రకారం.. పనిలో లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించడానికి, వాటిపై విచారణ చేపట్టడానికి సంస్థలు అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటుచేయాలి. పది లేదా అంతకంటే ఎక్కువమంది ఉద్యోగులు ఉన్న ప్రతి కంపెనీ.. ఈ కమిటీని ఏర్పాటు చేసుకోవాల్సిందే! ఎవరైనా మహిళా ఉద్యోగి వేధింపులకు గురైతే.. సదరు బాధితురాలు ఈ అంతర్గత ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేయవచ్చు.

**4 రాత్రిపూట అరెస్టు వద్దు**
సూర్యాస్తమయం తర్వాత, సూర్యోదయానికి ముందు.. మహిళలను అరెస్టు చేయకూడదు. ఏవైనా తప్పనిసరి పరిస్థితులు ఎదురైతే.. ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఆదేశంతో మాత్రమే రాత్రి సమయంలో మహిళలను అరెస్టు చేయడానికి అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, మహిళా ఖైదీని ప్రశ్నించే సమయంలో మహిళా కానిస్టేబుల్‌తోపాటు మహిళకు చెందిన కుటుంబసభ్యులు లేదా స్నేహితులు కూడా ఆమె పక్కన ఉండొచ్చు.

**5 అజ్ఞాతం.. మీ హక్కు**
లైంగిక వేధింపులకు గురైన మహిళలకు.. 'గోప్యత హక్కు' ఉంటుంది. దీని ప్రకారం.. బాధితురాలి పేరు, ఇతర వివరాలను బయటికి వెల్లడించకూడదు. మేజిస్ట్రేట్ ఎదుట ఒంటరిగా లేదా మహిళా పోలీసు అధికారి సమక్షంలో తన వాంగ్మూలాన్ని నమోదు చేసుకునే హక్కు బాధితురాలికి ఉంటుంది.

**6 ఉచిత న్యాయ సేవ**
లీగల్ సర్వీసెస్ అథారిటీస్ యాక్ట్.. అత్యాచార బాధితులకు ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తుంది. మహిళలు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు న్యాయ సహాయం పొందడానికి ఈ చట్టం హామీ ఇస్తుంది.

**7 గౌరవానికి భంగం వద్దు!**
లైంగిక వేధింపుల బాధితురాలికి.. తన గౌరవానికి భంగం కలగకుండా చూసుకొనే హక్కు ఉంటుంది. దీని ప్రకారం.. ఏదైనా వైద్య పరీక్షలు అవసరమైతే కేవలం మహిళా వైద్యురాలి ద్వారానే పరీక్షలు నిర్వహించాలి. ఇతరుల సమక్షంలో ఏ విధమైన శారీరక/మానసిక పరీక్షలు నిర్వహించడం చట్టవిరుద్ధం.